'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

కేసీఆరే గెలుస్తారు.. ఎందుకంటే?

కోవెల సంతోష్‌కుమార్
90521 16463

కేసీఆర్‌ను గెలిపించాలి! కేసీఆర్‌ను ఓడించాలి! ఇప్పుడు తెలంగాణ ఎన్నికల్లో ప్రధానంగా మారిన అంశం ఇదే. కేసీఆర్‌ను గెలిపించాలనే వారికి చాలా కారణాలే కనిపిస్తున్నాయి. కానీ కేసీఆర్‌ను ఓడించాలనే వారి దగ్గర ఉన్న కారణాలు ఒక్కటి కూడా కనిపించడం లేదు. పదేండ్లయింది కాబట్టి ప్రభుత్వాన్ని మార్చాలని కొందరు, కుటుంబ పాలన అని ఇంకొందరు.. ఇంతకు మించి ఒక్కటంటే ఒక్కటి ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత ఉన్నదనడానికి స్పష్టమైన కారణం చెప్పేవారే లేరు.

వంశపారంపర్యంగా రాచరిక పాలన చేస్తున్న పార్టీల నేతలు కుటుంబ పాలన గురించి మాట్లాడతారు. తెలంగాణలో ఆ పరిస్థితి లేదు. రాదు. తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన వారందరూ కూడా స్వయం ప్రకాశకులే. చెట్టు నీడ నుంచి బయటపడి వేళ్లూనుకొని ఎదిగినవారు. ఇక్కడ కుటుంబ పాలన అన్న మాటకు అర్థమే లేదు. మరి ప్రభుత్వ వ్యతిరేకత అంటే, అది కూడా కృతకమైన మాటే తప్ప ప్రజల్లో వ్యతిరేకతే లేదు. మీడియాలో, సోషల్ మీడియాలో మూడ్ క్రియేట్ చేయడానికి సృష్టించింది తప్ప మరేమీ కాదు. మన ఇండ్లల్లో ఫ్రిజ్ వాడుకుంటాం.. అది బాగానే ఉంటుంది.. పదేండ్లయింది కాబట్టి ఏదో కొత్త మాడల్ వచ్చిందని మార్చేస్తాం. కానీ, ప్రభుత్వాన్ని అలా మార్చలేం కదా ?

తెలంగాణలో కేసీఆర్‌ను మించిన ప్రత్యామ్నాయం ఏదైనా ఉన్నదా? అంటే ఇప్పటి వరకు లేదనే చెప్పాలి. తెలంగాణలోనే కాదు.. మొత్తం దేశంలోనే లేదు. కేసీఆర్‌కు దీటైన దార్శనికత ఉన్న దక్షత కలిగిన నాయకుడు ఉన్నాడా అంటే అదీ లేదు. ఎందుకంటే కేసీఆర్ విజన్ సామాన్యమైంది కాదు. సాధారణ రాజకీయ నాయకులకు.. కేసీఆర్‌కు హస్తిమశకాంతరం ఉంటుంది. దీన్ని ఎవరూ కాదనలేరు. ఉద్యమకాలం నుంచి కూడా నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా నిలబడి నిగ్గదీసే స్వభావం ఆయనది. ఆయనది పరిణతి కలిగిన వ్యవహారశైలి, నిర్మాణాత్మకమైన ఆలోచనావిధానం రాజకీయాలను వ్యక్తిగత సంబంధాలను పాలు నీళ్లలాగా వేరుచేసి చూడగల నేర్పు కేసీఆర్‌కు మాత్రమే చెల్లింది. రాజీపడని అడుగులు వేయడం సమకాలీన రాజకీయాల్లో ఆయనకు మాత్రమే సాధ్యమైంది. ఆయన ఎంత వేగంగా నిర్ణయాలు తీసుకోగలరంటే.. ఆ వేగాన్ని అందుకోవడం ఎవరివల్లా కానిపని. ఆయన తీసుకొనే ఏ నిర్ణయం కూడా ఇది సాధ్యమేనా అని అనిపిస్తుంది. సాధ్యం కాదనే కచ్చితంగా తోస్తుంది. కానీ.. ఒక్కొక్క స్థాయిలో దాని సక్సెస్ రేటు పెరుగుతూ పోతుంటే.. ఆశ్చర్యమేస్తుంది. అద్భుతమనిపిస్తుంది. చివరకు దాన్ని కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఏర్పడుతుంది.

> ఇందుకు ఉదాహరణలు.. ఢిల్లీ నుంచి అనేక రాష్ట్రాల దాకా పేర్లు మార్చుకొని.. తమ ఫొటోలు తగిలించుకొని, తమ ఖాతాలో వేసుకొని అమలు చేస్తున్న అనేక పథకాలను చూపించవచ్చు. ప్రతి నిర్ణయం వెనుక ఆయన దూరదృష్టి ప్రస్ఫుటమవుతుంది. తీసుకొన్న నిర్ణయాన్ని వెనుకడుగు వేయకుండా అమలుచేయగల నాయకుడు కేసీఆర్. అడిగినవారికి అడిగినది లేదనకుండా ఇవ్వగలిగిన ఔదార్యమాయనది.

విద్యుత్తు వ్యవస్థలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన సంస్కరణలైతే ఎవరూ ఊహించలేదు. తెలంగాణ రాష్ట్రం వస్తే ముందుగా వచ్చే సంక్షోభం విద్యుత్తే అన్నారు. కానీ.. స్వరాష్ట్రంలో తొట్టతొలి సంస్కరణ జరిగింది విద్యుత్తురంగంలోనే. ప్రభుత్వ విద్యుత్తు రంగ సంస్థలను బలోపేతం చేస్తూనే.. వివిధ మార్గాల నుంచి రాష్ట్రానికి విద్యుత్తును తీసుకువచ్చేందుకు ఆయన రచించిన వ్యూహం ఎవరికీ అంతుపట్టలేదు. ఇప్పటికి తొమ్మిదేండ్లు గడిచిపోయింది. మిగతా పథకాలను ఏదో రకంగా అమలు చేసిన రాష్ట్రాలు కానీ, కేంద్రం కానీ.. విద్యుత్తు సంస్కరణల విషయంలో తెలంగాణను అనుసరించడం ఇప్పటికీ సాధ్యపడనే లేదు.

రాష్ట్రాన్ని అన్ని పార్శ్వాలలో అభివృద్ధి చేయడంపైన దృష్టిసారించిన నాయకుడు కేసీఆర్. ఓ వైపు సంపదను సృష్టిస్తూనే.. దాన్ని ప్రజలందరికీ పంచడమెలాగో ఆలోచించిన సిసలైన నేత. విద్య, వైద్య రంగాల్లో ఆయన అనుసరించిన, అమలుచేసిన విధానాలు యావత్తు దేశానికే ఆదర్శాలు. ఒకనాడు కునారిల్లిన ప్రభుత్వ విద్య, వైద్య రంగాల్లో సమూల మార్పులు చేయడం ఒక్క కేసీఆర్‌కే సాధ్యపడింది. తెలంగాణలో ఆడపిల్ల జీవితానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్పించిన సామాజిక భద్రత తేలికైన ప్రణాళిక కాదు. శిశువు గర్భంలో ఉండగానే పౌష్టికాహారమివ్వడం దగ్గరి నుంచి ప్రసవానికి ప్రభుత్వ దవాఖానకు తీసుకొచ్చి.. ప్రసవానంతరం పదమూడువేల నగదు, కేసీఆర్ కిట్ ఇచ్చి.. తిరిగి ఇంటి దగ్గర దింపి.. పెరిగిన కొద్దీ ఉచితంగా చదువు చెప్పి.. పెండ్లీడు వచ్చిన తర్వాత లక్షా నూటపదహార్లు ఖర్చులకు ఇచ్చేంత వరకు సుదీర్ఘ ప్రణాళిక దేశంలో మరెక్కడా కనిపించదు.

దేశంలో పాజిటివ్ పాలిటిక్స్ నడుస్తున్న కాలమిది. తప్పనిసరిగా ప్రజలకు అభివృద్ధి కనిపించాలి. విజిబుల్ డెవలప్‌మెంట్ అన్న మాట ఇప్పుడు తెలంగాణలో మాత్రమే కనిపిస్తున్నది. అతి త్వరగా.. అత్యంత వేగంగా దశాబ్దాల తరబడి పెండింగ్‌లో పడేయకుండా నిర్మాణాత్మకంగా అభివృద్ధిని ఎలా చేయాలో చూపించిన, చూపిస్తున్న రాష్ట్రం ఇవాళ తెలంగాణ.

> ఈ తెలంగాణ పాలనకు మించిన ప్రత్యామ్నాయం ఏదైనా కనిపిస్తే.. దాన్ని అందుకోవడానికి ప్రజలు ఆలోచిస్తారు. కానీ అలాంటి ప్రత్యామ్నాయం లేనే లేదు. తెలంగాణలో బీజేపీ స్థానాన్ని కాంగ్రెస్.. కాంగ్రెస్ స్థానాన్ని బీజేపీ దక్కించుకోవడానికి ప్రయత్నిస్తున్నాయే తప్ప బీఆర్ఎస్ స్థానం దరిదాపుల్లోకి కూడా రాలేకపోతున్నాయనేది వాస్తవం.

కర్ణాటకలో విజయం సాధించగానే ఆ ప్రభావం తెలంగాణపై కూడా పడుతుందని కాంగ్రెస్ ఆశపడింది. కర్ణాటక మాడల్ అన్న పదాన్ని కాయిన్ చేయడానికి ప్రయత్నించింది. కర్ణాటకలో 5 గ్యారెంటీలు ఇస్తే.. ఇక్కడ ఆరు గ్యారెంటీలు ఇస్తామని ఊదరగొట్టారు. డిక్లరేషన్లు.. గ్యారెంటీలతో హంగామా జరిగింది. ఆరు గ్యారెంటీలు తమకు చాలా సానుకూలంగా మారుతాయని నమ్మారు. కానీ.. కర్ణాటక ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వచ్చి తమ రాష్ట్రంలో ఐదు గంటలకు మించి కరెంటు ఇవ్వటం లేదని ప్రచార సభలోనే మాట్లాడటంతో స్థానిక కాంగ్రెస్ నేతలకు గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. దీంతో ఎంత వేగంగా ఆరు గ్యారెంటీలు తీసుకొచ్చారో.. అంతే వేగంగా వాటిని పక్కన పెట్టి మళ్లీ కేసీఆర్ పై దుర్భాషలు, ఇతర అంశాలవైకి కాంగ్రెస్ ప్రచారం మళ్లింది. కేవలం కేసీఆర్ పై వ్యతిరేక ప్రచారంతోనే నాలుగు ఓట్లు సంపాదించుకోవచ్చన్న ఆలోచనలో కాంగ్రెస్ ఉన్నది.

> బీనికి తోడు పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆ పార్టీకి పెద్ద భారంగా మారుతున్నారన్న అభిప్రాయాలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే అయితే తెలంగాణ అవసరమే లేదని, అవన్నీ సీమాంధ్ర పాలకులు దండిగా ఇచ్చారని మాట్లాడటం ద్వారా రేవంత్.. తెలంగాణ ఉద్యమాన్ని తీవ్రంగా అవమానించారు. పాజిటివ్ అయినా.. నెగెటివ్ అయినా.. చర్చంతా తన చుట్టూనే తిరుగాలని అనుకుంటున్నానని టీవీల ఇంటర్వ్యూలోనే చెప్పిన నేత.

కాంగ్రెస్ తప్పకుండా అధికారంలోకి వస్తుందన్న ఒక మేనియా ఆయన్ని కమ్మేసింది. తన పార్టీ గెలిచినట్టు.. తానే ముఖ్యమంత్రి అయిపోయినట్టు ఆయనకు వస్తున్న కలల కల్లోలంలో ఎలా పడితే అలా మాట్లాడేస్తున్నారు. ఈ ధోరణి ఆయన సొంత పార్టీలోనే చాలామందికి నచ్చడం లేదు. ఈ వ్యాఖ్యానాలు రేవంత్‌కే కాదు, కాంగ్రెస్ పార్టీకి కూడా రివర్స్ అయ్యాయి. ఈయన కేసీఆర్ లాంటి నాయకుడికి ప్రత్యామ్నాయం అవుతారని ప్రజలు భావించడం లేదు.

ఇక బీజేపీ కూర్చొన్న కొమ్మనే నరుక్కున్నది. ఆ పార్టీ అధ్యక్షుడే పోటీ నుంచి తప్పుకున్నాడు కాబట్టి.. ఆ పార్టీ పోటీలో ఉన్నట్టు ప్రజలే అనుకోవడం లేదు. ఈ క్రమంలో తెలంగాణలో పార్టీని, ప్రభుత్వాన్ని మార్చాల్సిన అవసరం ప్రజలకు ఎంతమాత్రం కనిపించడం లేదు. కేసీఆరే వారికి ఏకైక నాయకుడు. వాళ్లు ఎప్పుడో డిసైడ్ అయిపోయారు. ఎందుకంటే, దశాబ్దాల పాలనలో పాలకుల ద్రోహాలతో, గాయపడిన తన జాతి విముక్తం కోసం అందరి కలను తన కలగా చేసుకొని గర్వంగా ఎగిరిన జెండా కేసీఆర్. మళ్లీ చీమల దండులా ఈ మట్టిని, ఈ గడ్డను నిలువు దోపిడీ చేయడానికి దండు కట్టి వస్తున్న దారి దోపిడీ దారులకు అడ్డుగా నిలిచి ఇప్పుడిప్పుడే తెరిపిన పడుతున్న తెలంగాణను సుదర్శనుడై అడ్డుకోగల ఏకైక నాయకుడు కేసీఆర్ కాబట్టి. ■

కాంగ్రెస్ పార్టీ 44 ఏండ్లలో హైదరాబాద్‌కు, తెలంగాణ జిల్లాలకు ఏం చేసింది? 2014 దాకా 10 జిల్లాలలో 9 జిల్లాలు వెనుకబడే ఉన్నాయి. వెనుకబడ్డ జిల్లాలకు కేంద్రం ఇచ్చే ప్రత్యేక గ్రాంట్లలోని ధనం కూడా వలస పాలకుల బాంకుల్లోకి వెళ్లిపోయి, ఆ జిల్లాలన్నీ ఏ మార్పు లేకుండా ఉన్నాయి. మరి 2014 దాకా దాదాపు 58 ఏండ్లలో తెలంగాణలో ఏం జరిగింది? తర్వాత గత తొమ్మిదిన్నరేండ్లలో ఏం జరిగింది? 58 ఏండ్లు తొమ్మిదిన్నరేండ్ల కంటె చిన్నవనిపిస్తున్నది తెలంగాణ అభివృద్ధి విషయంలో.

పాత విషయాలు పక్కనపెట్టినా, కాంగ్రెస్ పార్టీ విధి విధానాలు, నిన్న మొన్న జరిగిన కర్ణాటకలో ఎన్నికలప్పుడు ప్రమాణాలు చేసి పెట్టిన పథకాలు ఎలా ఉన్నాయో మన రాష్ట్రంలో కేసీఆర్ పెట్టిన పథకాలెలా ఉన్నాయో పోల్చి చూద్దాం! అప్పుడే తెలివి గల్ల పథకాలేవో, తెలివి తప్పిన పథకాలేవో తేటతెల్లమవుతుంది.

'తెలివిగల్ల, తెలివి తప్పిన పథకాలు'

కనకదుర్గ దంటు
89772 43484

1.గృహజ్యోతి: వినటానికి ఎంత చక్కని పేరు. ఈ పథకం కింద ప్రతి ఇంటికి 200 యూనిట్ల కరెంటు ఉచితంగా ఇస్తారు. ఈ పథకం ప్రజలను సహజంగానే ఆకర్షించింది. కానీ, ఏటా పెరుగుతున్న కరెంటు వాడకం, వారి రాష్ట్రంలో లభ్యమయ్యే కరెంటు సరిగ్గా లెక్కవేసుకోకుండా కోటి 34 లక్షల కుటుంబాలకు ఉచితంగా పవర్ ఇవ్వలేక రెండు నెలలలోనే బొక్కబోర్లా పడింది ప్రభుత్వం. పథకం సంగతి పక్కనపెట్టి కరెంటు ధర విపరీతంగా పెంచటం, కరెంటు కట్‌చేయటం చూస్తే ఈ పథకం ఎంత అనాలోచితంగా ప్రవేశపెట్టారో అర్థమవుతుంది. గృహజ్యోతి ఆరిపోయింది.

ఇక తెలంగాణలో ఏం జరిగింది? 2014లో రాష్ట్రం విడిపోగానే తెలంగాణకు రావలసిన కరెంటు చంద్రబాబు ప్రభుత్వం నిలిపేసింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ అన్యాయాన్ని వీరోచితంగా ఎదుర్కొని, ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటు కొని రాష్ట్రం అంధకారంలో మునిగిపోకుండా కాపాడారు. అంతేకాదు, భవిష్యత్తులో ఈ బాధ లుండొద్దని భద్రాద్రి, యాదాద్రి పవర్‌స్టేషన్లను స్థాపించి, నేడు రాష్ట్రంలో 24 గంటల కరెంటు అందరికీ, రైతులకు ఉచితంగానూ ఇస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 4, 5 రోజులు అతి కష్టం మీద పనిచేసిన పరిశ్రమలు నేడు పవర్ హాలిడేలు లేకుండా చక్కగా తమ ఉత్పత్తులను పెంచుకుంటున్నాయి. ఏ పథకం తెలివి తక్కువది, ఏ ప్రణాళిక తెలివైనదో తెలుసుకోండి!

2.గృహలక్ష్మి: ప్రతి కుటుంబంలో స్త్రీకి నెలకు రూ.2,000 ఇస్తామని ప్రకటించారు. 'దారిద్ర్య రేఖకు అడుగున ఉన్న కుటుంబాలే కోటి రెండు లక్షలున్నాయి. ఇక అన్ని కుటుంబాలకీ ఇస్తామనటంతో ప్రణాళిక ఘోరంగా విఫలమైంది. నెలరోజులు ఇచ్చాక గుడ్లు గూట్లోకి వచ్చి ఈ పథకం నిలిపివేశారు. గృహలక్ష్మి గృహజేష్ఠ అయింది. తెలంగాణలో ఆసరా పింఛన్లు వృద్ధులకు చిన్న మొత్తంలో మొదలుపెట్టి, క్రమంగా వికలాంగులకు, ఒంటరి మహిళలకు, బీడీ కార్మికులకు కూడా విస్తరించారు. అయితే ఒక పక్క సంపద పెంచి దానిని జాగ్రత్తగా లెక్కలు వేసి ఈ పథకాలు మొదలుపెట్టడంతో, అన్నీ విజయవంతంగా సాగుతున్నాయి. ప్రైవేటురంగ విస్తరణతో ఉద్యోగావకాశాలు చాలా పెరగటంతో నిరుద్యోగులకు ఈ పథకం విస్తరించలేదు.

3.అన్నభాగ్య: పేరెంత బాగుందో అంత అభాగ్య పథకమైంది ఇది కర్ణాటక కాంగ్రెస్ చేతుల్లో. అంతవరకు పరిపాలించిన బీజేపీ ప్రభుత్వం తమ అవినీతి సొమ్ము కొద్దిగా తగ్గిందని ఉచితంగా సరఫరా చేసే 7 కిలోల బియ్యం 5 కిలోలకు తగ్గించింది. అందుకని అనాలోచితంగా కాంగ్రెస్ తాము అధికారంలోకి వస్తే 10 కిలోలకు బియ్యం సరఫరా పెంచుతామని గొప్పలకు పోయింది. అయినా రైతు వ్యవసాయం బలోపేతం చేయకుండా, వారికి కరెంటు, నీళ్లు ఇవ్వకుండా తాము దానకర్ణుల్లా మారుదామంటే సాధ్యమేనా? ముందు వ్యవసాయాన్ని బలోపేతం చేసి ఒక సంవత్సరం తర్వాత నుంచి ఇస్తామని చెప్పే తెలివి లేకపోయింది కాంగ్రెస్ నాయకులకు. గెలిచిన మరు నెల నుంచి ఇస్తామంటే బియ్యం స్వర్గం నుంచి రాలతాయా? రెండు నెలల్లో పథకం పటాపంచలైంది. తాము పంచటానికి ఇతర రాష్ట్రాలను అడుక్కున్నారు. దొరకకపోవటంతో 5 కిలోలు ఇచ్చి మిగతా 5 కిలోలకు రూ.170 ఇస్తామంటే ఎవరు సంతోషిస్తారు? అలా అన్నభాగ్య ఎత్తిపోయింది.

తెలంగాణలో ముఖ్యమంత్రి మొట్టమొదటి ప్రాధాన్యతా అంశంగా వ్యవసాయాన్ని తీసుకున్నారు. ఉచిత కరెంటు కాక, మూడున్నరేండ్లలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా తెలంగాణ నేలంతా తడిపారు. రైతుబంధు ఇచ్చి, క్రమంగా సంపద పెరిగాక, ఆ ధాన్యాన్ని ప్రభుత్వమే రైతుల కల్లాలకు వెళ్లి కొనేటట్టు ఏర్పాట్లు చేశారు. మరి తెలివిగల వాళ్లు ఇలాగే కదా ఒక పథకాన్ని ప్రణాళికాబద్ధంగా సాగిస్తారు. ఇప్పుడు కుటుంబానికి కాదు, తలకు 6 కిలోల చొప్పున ఇస్తున్నారు. ఎన్నికల తర్వాత ఆ రేషన్‌లో కూడా అందరికీ చక్కటి సన్నబియ్యం ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు. మేధావి చాణుక్యుడు ఒక మాట అంటాడు: 'అధికారం నగరం నుంచి పల్లెకూ, సంపద పల్లె నుంచి రాజుకీ రావాలి.'

4.శక్తి: సగం మంది ఓటర్లు మహిళలుంటారు కాబట్టి అత్యుత్సాహంతో, అతి తెలివి తక్కువతో ప్రకటించిన పథకం ఇది. మహిళలందరికీ బస్సు ప్రయాణం ఉచితమన్నారు. దీనివల్లన అటు వాళ్ళ రోడ్డు రవాణా సంస్థ నష్టపోయింది. ఇటు ఆటోలు, క్యాబ్‌ల వాళ్ళు వ్యాపారం తగ్గిపోయి, నష్టపోయి, ప్రభుత్వాన్ని శాపనార్థాలు పెడుతున్నారు. అసలు ఏ మెదడు తక్కువ నాయకుడు ఈ పథకాన్ని రచించాడో కనుక్కోవాలి. తెలంగాణలో వృద్ధులు, ఒంటరి మహిళలకు పింఛన్లు, రేషన్ బియ్యం ఇవ్వటంతో వారు సంతోషంగా ఉన్నారు.

5.యువనిధి: ఈ పథకం అన్నిట్లో ప్రమాదకరమైనది. ఎందుకంటే ఇబ్బడి ముబ్బడిగా విద్యాలయాలు, విశ్వవిద్యాలయాలు ఈ దేశంలో పెంచుతూ పోయిన ప్రభుత్వాలు మాత్రం, విద్యా విధానాన్ని మార్చటం కానీ, మారుతున్న మార్కెట్లు, ఉద్యోగాలని గమనించి, దానికి తగిన కోర్సులను ప్రవేశపెట్టడం కానీ చేయటం లేదు. దేశంలో ఒక సర్వేలో డిగ్రీలున్న 85 శాతం యువతకు ఉద్యోగాలకు కావలసిన నైపుణ్యాలు లేవని తేలింది. ఉన్నత విద్యాసంస్థలకు సలహాదారులుగా, అధికారులుగా పైరవీకారులని నియమిస్తున్నాయే కానీ, నిజంగా మారుతున్న ప్రపంచాన్ని అర్థం చేసుకునే విద్యావేత్తలని నియమించటం లేదు. దానితో ఏటా పట్టాలు తీసుకొని బయటకు వస్తున్న వారి సంఖ్య పెరుగుతూనే ఉంటుంది. కనుక వారికి నిరుద్యోగ భృతి రాష్ట్రం మీద చాలా భారమవుతుంది. అయితే ఉద్యోగాలకు ప్రకటనలిస్తామని కర్ణాటక ప్రభుత్వం తప్పించుకుంటోందే కానీ ఈ పథకం ఇంకా మొదలవలేదు. బహుశా అవదు కూడా!

యువతకు నైపుణ్యాలు పెంచుకునే కేంద్రాలు స్థాపించి వాటిని బాగా నడపాలి రాష్ట్ర ప్రభుతాలు. అందుకే తెలంగాణలో స్టార్టప్ కంపెనీలకు ప్రోత్సాహం, పెట్టుబడి ఇస్తోంది బీఆర్ఎస్ ప్రభుత్వం. ప్రపంచంలో ఏ దేశమూ యువత అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించలేదు. అందుకే అన్నిరంగాలనూ వృద్ధి చేసి, చేతివృత్తులు, ఇతర వృత్తులు, ఉన్నత విద్యావంతులకు తమ సొంత కంపెనీల స్థాపనకు ప్రోత్సాహమిస్తోంది తెలంగాణ ప్రభుత్వం.

> ఎన్నికలప్పుడు హడావుడిగా పథకాలు ప్రకటించటం కాదు. ముందుగానే ఆ పథకం ఎంతమందికి ఉపయోగం దానికి డబ్బు ఎక్కడినుంచి ఎంత తేవాలి, ఆ పథకాన్ని ఎలా, ఎప్పుడు ప్రవేశపెట్టాలన్న ప్రణాళిక ఉండాలి. అట్లా ప్రణాళికలు రచించాలంటే మన ముఖ్యమంత్రి వంటి మేధావి, దార్శనికుడు, నిబద్ధత కలిగిన నాయకుడు ఉండాలి. పైన చెప్పిన విషయాలు కాంగ్రెస్‌లో ఎటువంటి తెలివి తక్కువ నాయకులున్నారో, మనం ఎటువంటి నాయకుడి నీడలో సుఖంగా ఉన్నామో అర్థం చేసుకోవాలి.

ఇంక అసలు హాస్యాస్పద విషయం పరిశీలిద్దాం! 5 పథకాలు గొప్పగా ఎన్నికల్లో ప్రకటించి, గెలిచి, మూడు నెలలు కాకుండా అన్నీ విఫలమయి, తమ రాష్ట్ర ప్రజలను నిరాశ, నిస్పృహలకు గురిచేసి, చెప్పినవి, చెప్పనివి వందల పథకాలు విజయవంతంగా నడుపుతున్న కేసీఆర్ రాష్ట్రానికి వచ్చి ప్రజలకు భాష నలిస్తున్నారు కర్ణాటక ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు! నవ్వకండి, బాగా ఆలోచించండి. ఎన్నికలు ఎంతో దూరంలో లేవు. తెలివి తక్కువ కాంగ్రెస్ కావాలా? మేధావి ముఖ్యమంత్రి కావాలా?

వివేకానంద అంటారు: 'ఎవరికీ వండుకోమని చేపలు ఇవ్వకండి; ఆ రోజుతో మీ సహాయం అయిపోతుంది. వారికి ఆ చేపల్నెలా పట్టాలో నేర్పించండి. స్వయం ప్రతిపత్తి కలిగేలా వారిని ప్రోత్సహించండి'. తెలంగాణ ప్రభుత్వం సరిగ్గా అదే చేస్తోంది. ■

నయవంచనే కాంగ్రెస్ నైజం

'బ్రిటిష్ రాజులు మన దేశానికి స్వాతంత్ర్యం ఇచ్చారన్నది వాస్తవం. మరి మనం ఇప్పుడు బ్రిటిష్ రాణి, రాజుల ఫొటోలు పెట్టుకొని మాకు స్వాతంత్ర్యం మీ భిక్షనే అని ప్రతీరోజు తలచుకోవాలా? స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీ వంటి స్వాతంత్ర్య సమరయోధులను తలచుకుంటున్నామా? స్వాతంత్ర్యం ఇచ్చినవారు గొప్పనా, ప్రజల పక్షాన నిలబడి స్వాతంత్ర్యం సాధించినవారు గొప్పనా?' తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ గొప్పనా, తెలంగాణ సాధించిన బీఆర్ఎస్ పార్టీ గొప్పనా? ముమ్మాటికీ బీఆర్ఎస్సే గొప్ప. కాంగ్రెస్ పార్టీ కూడా బ్రిటిష్ పాలకుల లెక్కనే ప్రవర్తించింది. బ్రిటిష్ వారు మనం అడిగిన వెంటనే స్వాతంత్ర్యం ఇవ్వలేదు. లక్షలమంది బలిదానాలు, ఆందోళనల తర్వాత ఇచ్చారు.

ఓరుగంటి సతీష్
80080 06667

కాంగ్రెస్ పార్టీ కూడా తెలంగాణ ప్రజల మనసు తెలుసుకొని రాష్ట్రం ఇవ్వలేదు. వేలమంది సామాన్యుల బలిదానాల తర్వాత.. సంఘర్షణ తర్వాత రాష్ట్రం ఇచ్చింది. తెలంగాణ ప్రజలను రాచిరంపాన పెట్టి.. అరిగోస పెట్టిన తర్వాత రాష్ట్రం ఇచ్చింది. కాంగ్రెస్ తీరు మొదటినుంచి తెలంగాణకు వ్యతిరేకమే. ఇది చరిత్ర చెప్తున్న సత్యం. అలాంటి కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు మరోసారి తెలంగాణ ప్రజల ముందుకువస్తున్నది. తెలంగాణ సమాజానికి కాంగ్రెస్ చరిత్ర తెలియనిది కాదు. దేశంలో 60 ఏండ్లు అధికారంలో ఉన్న ఆ పార్టీ ఏనాడూ ప్రజల కోణంలో పాలించలేదు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయలేదు.

తరతరాలుగా కాంగ్రెస్ పార్టీది రక్తచరిత్రే..: కాంగ్రెస్ పార్టీ తీరును గమనిస్తే.. తెలంగాణ ప్రాంతానికి తరతరాలుగా అన్యాయం చేస్తూనే ఉన్నది. దీనికి అనేక సాక్ష్యాలున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సందర్భంగా.. నిజాం రాజ్యం భారతదేశంలో విలీనమయ్యే సందర్భంలో నాటి హైదరాబాద్‌లో జరిగిన మారణహోమం ప్రపంచానికి తెలియనిది కాదు. ఆనాడు కేంద్రంలో అధికారాన్ని చెలాయిస్తున్నది కాంగ్రెస్ పార్టీ. కమ్యూనిస్టులను, అమాయక తెలంగాణ భూమి పుత్రులను రజాకార్ల పేరుతో దారుణంగా కాల్చి చంపారు. ఇక్కడ జరిగిన మారణహోమంలో సుమారు 40 వేల మంది ప్రజలు మరణించినట్టు నాటి కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీయే అంచనాకు వచ్చింది. అయితే, ఆ నివేదిక బయటకురాలేదు. కమిటీ చెప్తున్నదానికి రెండు-మూడింతల వరకు మరణాలు ఉండవచ్చని నాటి పెద్దలు, చరిత్రకారులు చెప్తుంటారు. ఇక ముల్కీ ఉద్యమం గురించి తెలియనివారు తెలంగాణలో ఉండరు. మా ఉద్యోగాలు మాక్కావాలంటూ తెలంగాణ యువత 1952లో పోరాటాన్ని ప్రారంభిస్తే... నాడు అధికారంలో ఉన్న కర్కశ కాంగ్రెస్ హైదరాబాద్‌లో యువతను కాల్చిచంపింది. 18 మంది యువకులు ఈ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయారు. వేలమంది యువకులను జైల్లో పెట్టారు. ఆనాడు జరిగిన ఉద్యమంలో పాల్గొన్న వ్యక్తుల్లో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ కూడా ఒకరు. నాటి సిటీ కాలేజీ వద్ద జరిగిన సంఘటన గురించి తెలంగాణ ఉద్యమ సమయంలో అనేక మార్లు చెప్పిన విషయం మనందరికీ తెల్సిందే. ఇక 1969లో జరిగిన తొలిదశ తెలంగాణ ఉద్యమ పోరాటం గురించి మనకు తెల్సిందే. ఆనాడు సుమారు 340 మంది ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటంలో అసువులు బాశారు. మదన్మోహన్ రెడ్డి, మర్రి చెన్నారెడ్డి నేతృత్వంలో జరిగిన రాజకీయ పోరాటాన్ని నాటి ప్రధాని ఇందిరాగాంధీ నీరుగార్చింది. పెద్ద మనుషుల ఒప్పందం వట్టిపోయింది. తెలంగాణ ప్రజా సమితి పార్టీ గుర్తుపై గెలిచిన పది మంది ఎంపీలను కాంగ్రెస్‌లో విలీనం చేయించుకొని తెలంగాణకు ద్రోహం చేసింది కాంగ్రెస్ పార్టీ. తెలంగాణ ప్రజలకు ఆనాడు కూడా మాయమాటలు చెప్పి.. మభ్యపెట్టి ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షలను తుంగలో తొక్కింది కాంగ్రెస్. తెలంగాణ ప్రజా సమితి పార్టీని నామరూపాల్లేకుండా చేసింది. తెలంగాణ అస్తిత్వానికే సవాలు విసిరింది కాంగ్రెస్ పార్టీ. పెద్ద మనుషుల ఒప్పందం పేరుతో తిమ్మిని బమ్మి చేసింది.

> తెలంగాణ ప్రజలంటేనే నక్సలైట్లని.. తెలంగాణ యువత అంటే టెర్రరిస్టులుగా చిత్రీకరించిన ఘనచరిత్ర కాంగ్రెస్ పార్టిదే. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడక, ఇక్కడి వనరులు దోపిడీకి గురవుతుంటే ఆనాడు యువత అటవీబాట పట్టింది. ఇలా వెళ్లిన వారిని సంఘ విద్రోహులుగా చిత్రీకరించి ఎన్‌కౌంటర్లు చేసిన పాపం కాంగ్రెస్ పార్టిదే. 1972 తర్వాత ఐదు సూత్రాల పథకం, ఆరు సూత్రాల పథకం అంటూ తెలంగాణ యువతను మాయ చేసే కుట్ర చేసింది.

మలిదశ ఉద్యమాన్ని అణచివేసే కుట్ర..: తెలంగాణ ఉద్యమాన్ని అన్ని దశల్లోనూ అణచివేసే కుట్రచేసింది కాంగ్రెస్ పార్టీనే. 2001లో ఉమ్మడి రాష్ట్రంలో జవసత్వాలు కోల్పోయి ఉన్న కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఉద్యమం ఊతకర్రలా కనిపించింది. ఆనాడు స్థానికసంస్థల ఎన్నికల్లో కేసీఆర్ సృష్టించిన సునామీని చూసిన కాంగ్రెస్.. ఆ తర్వాత 2004లో కేసీఆర్‌తో పొత్తు పెట్టుకున్నది. తెలంగాణ ఇవ్వాలన్న ఏకైక షరతుతో కేసీఆర్ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నాడు. తన శక్తియుక్తులన్నింటిని ధారపోసి కాంగ్రెస్‌కు అధికారం దక్కేలా చేశారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్ట